# ఆయన కీర్తి వెనక...

"వంట పూర్తి అయిందా" అన్నాడు వెంకట్రామయ్య కరివేపాకు కోసుకుందామని పెరట్లోకి వచ్చిన సీతమ్మతో.

"ఆ! అయిపోవచ్చింది. ఏం ఇవ్వాళ అలా అడుగుతున్నారు?" అంది సీతమ్మ ఆశ్చర్యంగా. ఎప్పుడూ పన్నెండు దాటితే గానీ భోజనం మాట ఎత్తనివ్వడు భర్త. అటువంటిది ఇవ్వాళ పదిన్నర అయిందో, లేదో వంటయిందా అని అడుగుతుంటే ఆశ్చర్యం అనిపించిందావిడకి.

"ఒకతను వస్తానన్నాడు పదకొండున్నరకి. అతనితో మాట్లాడుతూ కూచుంటే ఒంటిగంటయిపోతుందేమో, బాగా ఆలస్యమైపోతుంది. అందుకే ముందుగా తినేసి కూచుంటే నయం కదా అని.." అన్నాడాయన.

"సరే. అయితే ఓ పదినిమిషాల్లో వడ్డించేస్తాను" అంటూ కరివేపాకు కోసుకుని వంటింట్లోకి వెళ్ళింది.

"సరే" అంది కానీ, ఆవిడ మనసులో ఉక్రోషం కలిగింది. తను ఎప్పుడైనా ఆకలేసి ముఖ్యంగా ఉపవాసం ఉన్నతరవాత మర్నాడు నీరసం అనిపించి, త్వరగా భోజనానికి లేవమంటే ససేమిరా అని కుర్చీలోంచి కదలడు.

"నువ్వు భోంచేసెయ్యరాదూ నన్ను చంపకపోతే?" అంటాడు "ఆయన భోంచెయ్యకుండా నేను చెయ్యనని తెలుసు. అరవై ఏళ్ళుగా కాపురం చేస్తున్నాం. ఆయన సంగతి నాకు తెలియదా. నా సంగతి ఆయనకి తెలియదా! నేను ముందుగా భోంచేస్తే కాస్త నడుం వాల్చాలనిపిస్తుంది. తీరా ఓ కునుకు పట్టిందంటే బద్ధకం వదిలించుకుని ఆయనకి వడ్డించాలంటే చిరాకేస్తుంది. ఆయన ఎప్పుడూ తనంతట తను వడ్డించుకు తినరు..."

భర్త స్వభావాన్ని నెమరు వేసుకుంటూ "ఇంతకీ ఎవరొస్తున్నారో అంతసేపు మాట్లాడ్డానికి? అడిగితే స్వయంగా చెబుతారు కనకనా? మగవాళ్ళకి సవాలక్ష వ్యవహారాలుంటాయి. నీకెందుకవన్నీ? అంటూ గుప్పిట్లో పెట్టుకుంటారు. మళ్ళీ తన అవసరం ఏదన్నా ఉంటే మాత్రం చిలకలా అన్నీ చెబుతారు!" అనుకుని లోలోపల నవ్వుకుంది అంతకన్నా చేసేదిలేక.

భోజనం చేస్తున్నప్పుడయినా, ఆ రాబోయే వ్యక్తి ఎవడో, ఎందుకొస్తున్నాడో ఏమీ చెప్పలేదాయన. సీతమ్మ కూడా తనంతట తను అడగలేదు.

అనుకున్నట్లుగానే పదకొండున్నరకి ఎవరో బెల్లు నొక్కారు. వెంకట్రామయ్యే వెళ్ళి తలుపు తీశాడు. ఒకడు కాదు. ఇద్దరొచ్చారు. ఒకతను కెమేరా భుజాన తగిలించుకుని వచ్చాడు. సీతమ్మ మధ్య గది తలుపు చాటు నుంచి చూసింది.

ఎండలో రావడం మూలాన్ని దాహం వేసినట్లుంది వాళ్లకి. మంచి నీళ్లు కావాలన్నారు. వెంకట్రామయ్య లోపలికొచ్చి సీతమ్మని రెండు గ్లాసులతో మంచినీళ్ళు చల్లటివి కుండలోవి తెచ్చిపెట్టమన్నాడు.

సీతమ్మ నీళ్ళ గ్లాసులు పళ్ళెంలో పెట్టి పళ్ళెం పుచ్చుకుని హాల్లోకి వెళ్లేసరికి, అక్కడ కూర్చున్న వాళ్లలో కెమేరా పట్టుకున్నతను కాకుండా ఇంకో అతను వెంకట్రామయ్యని స్వాతంత్ర్య సమరంలో ఆయన పాత్ర గురించి చెప్పమంటున్నాడు. "స్వాతంత్ర్య పోరాటంలో ఆంధ్రదేశం" అనే ఉత్తమ గ్రంథాన్ని రాసినందుకు ఆయనకి లభించిన పురస్కారం గురించి ప్రస్తావిస్తూ, యాభైఏళ్ళ స్వాతంత్రోత్సవం సందర్భంగా, ఆయన గతంలోని అనుభవాల గురించి తెలుసుకుని తమ పత్రికలో ప్రచురించాలనుకుంటున్నట్లు చెప్పాడు.

వాళ్ళెందుకొచ్చారో సీతమ్మకి అర్థమైంది.

భర్త ఉత్సాహంగా తన బాల్యంతో మొదలుపెట్టి చెబుతూంటే, సీతమ్మ ఖాళీ గ్లాసులూ, పళ్ళెం పుచ్చుకుని లోపలకి వచ్చేసింది. అప్పటికే వంటింట్లో అన్నీ సర్దుకోవడం అయిపోవడంతో, మధ్యగదిలో పడక్కుర్చీలో నడుం వాల్చింది సీతమ్మ. హాల్లోంచి వెంకట్రామయ్య కబుర్లు స్పష్టంగానే వినిపిస్తున్నాయి ఆవిడకి. మధ్యమధ్య ఆ పత్రిక అతను ఏవో ప్రశ్నలు వేస్తున్నాడు. ఆయన సమాధానాలు చెబుతున్నాడు వివరంగా.

ఆ రోజులన్నీ కళ్ళకు కట్టినట్లయింది సీతమ్మకి. కాపురానికొచ్చి నాలుగైదేళ్ళు కాలేదు. అప్పుడే ఇద్దరు పిల్లలు - పెదపిల్లవాడికి రెండేళ్ళు దాటాయి. రెండోవాడికి మూడో నెల... అప్పటికే ఉధృతంగా సాగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో తన భర్త ముందుకు దూకాడు.

కాలేజీలో పాఠాలతో బాటు స్వాతంత్ర్యోద్యమం గురించి పిల్లలకి నేర్పించడమే కాకుండా, సాయంకాలం పార్కులో గుమిగూడిన వాళ్లని పోగుచేసి నినాదాలిస్తూ ఉపన్యసించడం, పోలీసులు వాళ్ళని చెదరగొట్టడానికి ప్రయత్నిస్తే ఎదిరించి లాఠీ దెబ్బలు తినడం, అరెస్టయి జైలుకి వెళ్లడం, ఆ జైల్లో పరిస్థితులు ఎలా ఉండేవో, ఆ అనుభవాలన్నీ చెప్పుకొస్తున్నాడాయన.

జైలు నుంచి వచ్చాక, తన వాటా పొలంలో కొంత అమ్ముకోనిమ్మని తండ్రిని అడిగితే ఆయన ఒప్పుకోలేదు. ఇంకా చేతికందాల్సిన కొడుకులున్నారు. ఇప్పటినుంచీ ఉన్న కాస్త పొలం అమ్ముకుంటే ముందు ముందు ఎలా గడుస్తుందని ఆయన భయం. వచ్చిన ఉద్యోగం కాలదన్నుకుని రాజకీయాల్లో చేరడమే కాకుండా, ఉన్న ఆస్తిని కూడా తగలేస్తానంటే

ఎలా అంటూ దబాయించాడు తండ్రి. భర్త బాధ చూడలేక, తన చేతిగాజులూ, గొలుసూ తీసిచ్చింది ఉద్యమం కోసం వాడుకోమని.

ఆనాటి సంగతులన్నీ పత్రికతనితో వెంకట్రామయ్య చెబుతూంటే తను నగలు ఇచ్చిన సంగతి కూడా చెబుతాడేమోనని చెవులు రిక్కించి వింది సీతమ్మ. చెప్పినట్లు లేదు. గబుక్కున లేచి వెళ్లి హాలు గుమ్మంలో నుంచుంది. ఫొటోలతనూ, పత్రిక - అతనూ సీతమ్మ కేసి చూశారు. హఠాత్తుగా వాళ్ళు తన వైపు చూడటం మానేసి తన వెనకాల గుమ్మం వైపు చూస్తూంటే అనుమానం వేసి వెనక్కి తిరిగి చూశాడు వెంకట్రామయ్య. సీతమ్మ గుమ్మంలో నిలబడి ఉండటం చూసి "ఏం కావాలి?" అన్నాడు కనుబొమలు ముడిచి. పానకంలో పుడకలా అడ్డొచ్చిందన్నట్లు విసుగు ధ్వనించింది అతని కంఠంలో. ఆవిడ చెప్పదలుచుకున్న మాటలు గొంతులోంచి కడుపులోకి జారిపోయాయి.

"అబ్బె, కాఫీ ఏమన్నా తెమ్మంటారేమో, అడుగుదామని....." అంది తడబడుతూ. ఆవిడ కాఫీ ప్రసక్తి తెచ్చాక తను వద్దంటే బావుండదని. "ఊ! పట్రా. అడగడం దేనికి?" అన్నాడు దర్పంగా. సీతమ్మ లోపలికి వెళ్ళింది.

తన చేతి గాజులూ, గొలుసూ తీసి భర్త కిచ్చిందని తెలిసి ఆనాడు తన తల్లి చివాట్లేసింది. ఆడదాని ఒంటినున్న బంగారం వాడుకున్నందుకు అల్లుణ్ణి ఆడిపోసుకుంది.

ఆ తరవాత తండ్రి వెనకాల పడి ఆస్తి కొంత అమ్మించి ఉద్యమంలో మరింత తీవ్రంగా పాల్గొని, మరో రెండుసార్లు భర్త జైలు పాలవడం, ఆ సమయంలో తను పిల్లల్ని తీసుకుని కొన్నాళ్ళు పుట్టింట్లోనూ, కొన్నాళ్ళు అత్తింట్లోనూ ఉంటూ, పిల్లల చదువులు పాడవుతున్నందుకు బాధ పడుతూ, అందరి సూటి పోటీ మాటలు పడుతూ, భర్త ప్రతిసారీ జైలు నుంచి వచ్చాక తనకి నెల తప్పడంతో సిగ్గుపడుతూ, పిల్లల్ని కని పెంచి పెద్ద చెయ్యడంలో, చదువులు చెప్పించడంలో తను ఎన్ని అవస్థలు పడినదీ గుర్తుకొచ్చింది సీతమ్మకి.

ఆ మధ్య కాలంలో దుర్గాబాయమ్మగారితో పాటు కొందరు మహిళలు జండాలు పుచ్చుకుని స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం చూశాక, సీతమ్మకి కూడా ఉత్తేజం కలిగింది.

"నేను కూడా వాళ్ళతో కలిసి ప్రచారానికి వెడతానండీ" అంది ఓసారి భర్తతో.

"రేపు అరెస్టయి జైలుకి వెడితే పిల్లల్ని ఎవరు చూస్తారు?" అని నిలదీశాడు భర్త.

"నేను హఠాత్తుగా చస్తే ఏం చేస్తారు?" అంది ఒళ్ళు మండి.

"ఏం చేస్తాను. మళ్ళీ పెళ్ళి చేసుకుంటాను!" అన్నాడు వెటకారంగా నవ్వుతూ. ఆ వెటకారం వెనక నిజం లేకపోలేదనిపించి, నోరు మూసుకుని ఊరుకుంది.

ఎలాగో ఆ జ్ఞాపకాలన్నింటినీ పక్కకి నెట్టి, కాఫీ కలిపి రెండు గ్లాసుల్లో పోసి హాల్లోకి తీసికెళ్ళింది.

ఓవైపు వెంకట్రామయ్య మాట్లాడుతూంటే మరోవైపు ఆ ఫోటోలతను ఒకే వరసన ఫోటోలు తీస్తున్నాడు ఇటు నుంచీ అటునుంచీ. "అన్ని ఫోటోలెందుకో!" అనుకుంటూ ఆశ్చర్యంగా చూసింది సీతమ్మ కాఫీగ్లాసులు పెట్టి తెచ్చిన పళ్ళెం అలాగే చేత్తో పట్టుకుని.

"వెంకట్రామయ్యగారూ! ప్రతి పురుషుని విజయం వెనక ఒక స్త్రీ ఉంటుందంటారు కదా. మీ విషయంలో ఎవరైనా ఉన్నారా?" అన్నాడు పత్రిక అతను.

ఆ ప్రశ్న చిత్రంగా అనిపించింది సీతమ్మకి. భర్త ఏం సమాధానం చెబుతాడా అని కుతూహలంగా చూసింది భర్త కేసి. వెంకట్రామయ్య అరక్షణం సేపు తబ్బిబ్బైనట్లు కనిపించాడు. అంతలోనే తేరుకుని "ఈవిడ తప్ప వేరే స్త్రీ ఎవరూ లేరండోయ్" అంటూ నవ్వేసి భార్య కేసి ఓరగా చూశాడు.

అతిథులిద్దరి కోసం కాఫీ గ్లాసులు మధ్య బల్ల మీద పెట్టి, సీతమ్మ తిరిగి లోపలికి వెళ్ళబోతూంటే, ఆ ఫొటోలతను "అమ్మా! ఒక్కసారి ఆయన వెనకాల నుంచోండి. మీ ఇద్దరి ఫొటో తీసుకుంటాను" అన్నాడు.

"అయ్యయ్యో! నాకెందుకు నాయనా?" అంటూ రెండడుగులు వెనక్కి వేసింది. ఆమాట అందుకుని, "మధ్యలో ఆవిడనెందుకు లెండి" అన్నాడు వెంకట్రామయ్య తేలిగ్గా. పత్రిక అతను వాళ్ళని ఇబ్బంది పెట్టడం ఎందుకన్నట్లు ఫొటోగ్రాఫర్ కేసి 'వద్దులే' అన్నట్లు చూశాడు.

సీతమ్మ లోపలికి వెళ్ళిపోయింది. మళ్ళీ వాలుకుర్చీలో కూర్చుని, "నా కెందుకు" అని ఎందుకు మొహమాటపడ్డానా అని బాధపడింది ముందు. తరవాత "మంచి పని చేశాను, కక్కుర్తి పడలేదు నయమే" అనుకుంది. ఆయన పోరాటంలో పాల్గొంటే తను ఇంట్లో ఉండి పిల్లల సంగతి చూసుకుని ఎలాగో సంసారాన్ని నెట్టుకొచ్చింది. తనూ ఆయనతో పాటు జైలుకి వెళ్ళి ఉంటే పిల్లల గతి ఏమై ఉండేది? ఆయనన్నట్లు నిజమే. కానీ, ఆనాడు తను ఎవర్నీ లెక్కచెయ్యకుండా ఆయనలా దేశం కోసం తెగించి జైలుకి వెళ్ళడానికి సిద్ధపడి ఉంటే, ఈరోజున ఆ పత్రిక అతను తనని కూడా తన పోరాటానుభవాల గురించీ, తను చేసిన త్యాగాల గురించీ అడిగి, తన గురించి పేపర్లో రాసేవాడు కదా. ఆ ఫొటోలతను తనకి కూడా ప్రత్యేకంగా ఫోటోలు తీసేవాడు కదా అనుకుంటూ, చేజారిపోయిన కీర్తిని తలుచుకుని కించపడింది కొంతసేపు.

విరక్తిగా పడక్కుర్చీలోంచి లేస్తూ, "ఏమిటో? స్వతంత్రం వచ్చి యాభై ఏళ్ళయిందంటూ ఉత్సవాలు జరుపుతున్నారు. ఎవరి కొచ్చిందో మరి ఆ స్వతంత్రం? నాకైతే వచ్చినట్టు లేదు! " అనుకుంది.

సుప్రభాతం వీక్లీ, 9 ఆగస్టు '98